# దర్గామిట్ట కతలు

## బంగారు కొట్టులో మన 'అసిస్టెంటు' నౌకరీ!

మా యిద్యానికేతన్‌లో హైమవతీ అనే హిందీ టీచరు ఉండేది. ఆమె ఎప్పుడూ నవ్వతా, అరి చేతిలో చాక్‌పీసు ముక్క దొర్లించుకుంటా 'ఠండే జామూన్ గరమ్ జామూన్' పాఠాలు చెప్తా ఉండేది.

ఆమె చెప్పే పాఠాలు మా కిలాసులోని క్లవర్ల కంటే నాకే బాగా అర్దమవతా ఉండేసరికి (మా యింట్లో మాట్లాడే హమ్, తుమ్, హై, నైలు అర్దమవడం ఒక లెక్కా?) హైమవతి టీచరుకి నేనంటే బలే ప్రేమ ఏర్పడింది. అదీగాక, మా యింటికి దగ్గరగా ఉండే గురవయ్య శెట్టోళ్లింట్లో ఆమె బాడిక్కి ఉండేది కాబట్టి 'మా యింటికి రారా' అని పిలస్తా ఉండేది. పొయ్యినప్పుడల్లా తినడానికి పప్పు చెక్కలు, మనుబూలు యిచ్చేది. పెదాలకి కరిపించుకొని తాగతా ఉన్నా యిస్టీలు గిలాసులో తాగడానికి నీళ్లిచ్చేది.

అంతదాకా కత బాగానే ఉన్నా ఎండాకాలం సెలవలొచ్చేసరికి నా దుంప తెగింది. ఆ సెలవలకి మా హైమవతి టీచరోళ్ల అక్క కొడుకు విశ్వం అనేవోడు వచ్చినాడు వాళ్లింటికి. కర్మగాలి వాడిది కూడా నా వయుసే. సిక్స్ పరీక్షలు రాసినాడంట.

'అబ్బ! బలే దొరికినావే. మనిద్దరం కలిసి ఎంచక్కా లెక్కలు చేసుకోవచ్చు' అన్నాడు వాడు నేను పరిచయం అయ్యీ కాంగానే.

నా గుండె గుభేలుమంది.

'లెక్కలేంది?' అన్నాను, బిక్కు బిక్కు మంటా.

'ఏడో కిలాసు లెక్కలు సామీ. యిప్పటి నుంచే చెయ్యకపోతే కామను పరీక్షల్లో ఫస్టు మార్కులు ఎట్టా వస్తాయి?' అన్నాడు వాడు, యీ పద్దతే నీకు తెలియదా అనే విదంగా నా తట్టు చూస్తా.

నేను బెదురు బెదురుగా చూసినాను వాణ్ణి. రెండు మూడు రోజుల్లోనే వాడి అదన ప్రసంగి యవహారం అర్థమయిపోయింది నాకు. వాడంటా... ప్రతీ ఎండాకాలం సెలవల్లోనంటా... చేరబోయే కిలాసులోని లెక్కలు చేసుకుంటా కూచుంటాడంట. అయిదో కిలాసు సెలవల్లోనే ఆరో కిలాసు లెక్కలు మొదలు బెట్టినాడంట. ఇప్పుడు ఆరో కిలాసు సెలవల్లో ఏడో కిలాసు లెక్కలు మొదలు బెడతాడంటా.

కిందకి ఒంగి, రెండూ కాళ్లు పట్టుకొని 'దబీ' మని లాగి కింద పడేద్దామా అనిపించింది నాకు వాణ్ణి చూస్తానే. యిట్టాంటి నాయాళ్లు ఉండబట్టే కదా, యీళ్లతో పోల్చి మార్కులు తక్కవ వస్తా ఉన్నాయని మాల్యాద్రయివోరు మా బోటోళ్లని సావనూకేది అని కూడా అనిపిర్చింది.

అంతే. మరుసటి రోజు నుంచి హైమవతి టీచరోళ్ల యింటికి పోవడమే మానేసినాను. ఎందుకంటే విశ్వం లాంటోళ్లతో పెట్టుకుంటే సెలవల్లో ఎంజాయిమెంటుతో పాటు, రోజుకి రెండు రూపాయిల ఆదాయం కూడా పోయేటట్టుంది నాకు.

ఏమాదాయం అంటే పోయిన సమచ్చరం నుంచి నేను ఎండాకాలం సెలవల్లో మా తాత బంగారు కొట్టులో కూచొని రోజుకు రెండు రూపాయలు సంపాదిస్తా ఉన్నాను– అసిస్టెంటు నౌకరీ చేస్తా.

అసిస్టెంటు నౌకరీ అంటే ఏమీలా. పొద్దున్నే ఎనిమిది గెంటలకల్లా కొట్టుకి రావడం, చీపిరి తీసుకొని దుమ్ము లేచి పోయేలా కొట్టంతా చిమ్మడం, రైల్వే రోడ్డులోని మసీదుకాడికి పోయి కూజా నిండుగా మంచినీళ్లు నింపుకొని రావడం, యినప్పెట్టె తుడవడం, అనేక కుంపటి ముందర గోతాంపట్ట పరుచుకొని బాసిమెట్టు(పద్మాసనం) వేసుకొని కూచోవడం, అంతే!



మా కావల్లో బంగారు కొట్ల వీదైన ఇష్టాలయం వీదికి ఎంట్రన్సులోనే మా తాత (అమ్మ నాయిన) బంగారు కొట్టు ఉన్నా పేరుకే అది బంగారు కొట్టు. పెద్ద పెద్ద నెక్లెస్‌లు, డాలరు దండలు, నరుడులు అమ్మడం మా కొట్టులో ఉరడదు. తాళిబొట్లు, బేసర్లు, రాళ్లకమ్మలు, వెండి గజ్జెలు, కాలి మెట్టెలు... యీటివే ఎక్కవగా అమ్మతా ఉండే వాడు మా తాత. యీటిని అమ్మడంతోపాటు కంసాలి పనిలో మరిగిన్ని డబ్బులు సంపాదించేవాడు ఆయన. దండ తెగిపొయ్యందనో, కమ్మలో రాళ్లు ఊడివాయనో వచ్చే రిపేరు పనులను అయిదు నిమిషాల్లో ముగించి అయిదు రూపాయలను గల్లాపెట్టెలో వేసుకునేవాడాయన.

యిట్టాంటి రిపేర్లకి కుంపటి, 'పట్టెడ'లతోనే పని కాబట్టి నా అసిస్టెంటు నౌకరీలో ప్రదాన పని ఏమిటంటే మా తాత వచ్చేటప్పటికి యీ రెండింటిని రెడీగా చేసి పెట్టడం.


పట్టెడ మీద ఇసుక, నీళ్లు పోసి సుత్తితో రుద్దీ రుద్దీ దానిని తెల్లంగా చేయడం పెద్ద కష్టమేమి కాదు గానీ కుంపటి వెలిగించడమే బలే కష్టం. దానిలోని ముందరి రోజు బూడిదంతా పారబోసి,

కొత్త పొట్టు (వడ్లపొట్టు) కూరుకొని, వడిమధ్యన బొగ్గులు కుప్పగా పోసి నెమ్మదిగా నిప్పంటించేవాణ్ణి. అయితే అవి మాదర్చోద్ బొగ్గులు కాబట్టి ఒక పట్టాన అంటుకోవు. మానెలో ముంచిన గుడ్డ పీలికని వడి మద్యన ఇరికించి, ఊదుదు గొట్టంతో ఊదతా నానా అగచాట్లు పడాలి. అప్పటికి గాని బొగ్గులన్నీ ఎర్రంగయ్యి ఆరిపోకుండా అట్నే ఉండిపోతాయి.

# దర్గామిట్ట కతలు

మా తాతకు నేను అసిస్టెంటునే గాకుండా రిలీవరుని కూడా. అంటే ఆయన అన్నానికీ నమాజుకీ పోయినప్పుడల్లా కొట్టుని కాపెట్టుకోని ఉండాలి. అట్టా నేనొక్కణ్ణే ఉన్నప్పుడల్లా రకరకాల ఆటలాడతా వుండేవాణ్ణి.

ముందు రొంత రాగి ముక్కో, ఇత్తడి ముక్కో తీసుకొని 'వరవురాయి' మీద గట్టిగా గీరేవాణ్ణి. నల్లంగుండే ఆ రాయి మీద తెల్లటి పాపిటిలాగా పడేది గీత. అప్పుడు ద్రావకం సీసా దించి ఆ గీతమీద ఒక్క చుక్క ద్రావకం పోసి, ఆపైన యింకో చుక్క ఉప్పనీళ్లు పోసేవాణ్ణి. ఉప్పనీరు




పడంగానే పసుపు రంగులో బుసబుసమని ఉబికేది గీత (అదే బంగారం అయితే గీత రొంత కూడా చెరగదు. వెండయితే పెరుగునీళ్ల తీరులో మారిపోతుంది). ఆ పసుపు రంగును అట్టా యిట్టా చూసుకొని మళ్లా కడిగి పెట్టేసేవాణ్ణి.

మా కొట్టుకి ఏదైనా పెద్ద గిరాకీ వచ్చినప్పుడు నాకు బలే అదురుగా ఉండేది. ఆ గిరాకీ ఏదో రేటుకు బేరం కుదుర్చుకొని తప్పనిసరిగా వస్తువు కొనుక్కోని పోవాలని మనసులో మనసులోనే దేవుడికి మొక్కుకుంటా ఉండేవాణ్ణి. ఎందుకంటే బేరం కుదరక గిరాకీ చేయిజారిపోతే మా తాతకు బలే కోపం వచ్చేసేది. అప్పుడు నమం చిన్న తప్పు చేసినా తప్పదానికి 'చిట్టకారు' తీసుకొని మీద కొచ్చేసేవాడు. అదే బేరం కుదిరిందంటే పెండం సోడా షాపు నుంచి మా యిద్దరికీ ఆరంజీ క్రష్షు గానీ, రాజస్తాను సేటు కాణ్ణుంచి ఇలాచీ టీ గానీ తెప్పించేవోడు, హుషారుగా.

ఇట్టా సెలవల్లో నెల్నాళ్లన్నా మా తాత దగ్గర పని చేసేవాణ్ణి కాబట్టి తక్కిన బంగారు కొట్లలో ఉన్న నాబోటి సాయిబుల పిలకాయలందరూ పరిచయమయ్యేవోళ్లు నాకు. నేనన్నా ఎండాకాలం సెలవల్లో ఈ పని చేసేవాణ్ణి గాని యీళ్లు అప్పి రోజులూ ఈ పనే చేస్తా టీలు మోస్తా తిరగతా ఉండాలంట.

'యిప్పటి దాకా యిస్కూలు గడపే తొక్కలేదు తెలుసా?' అనేవాళ్లు.

'ఎందుకని?' అని అడిగితే 'ఏమో...మా నాయిన చేర్పించినాడు; రోజుకు రెండు రూపాయలు యిస్తుర్లా' అనేవాళ్లు.

మా బజారులోని బంగారం కొట్లన్నీ సాయిబులవీ శెట్టిగార్లవే అయినా 'అసిస్టెంట్లు' మాత్రం పదికి తొమ్మిది మంది సాయిబుల పిలకాయలే ఉండేవాళ్లు. పాపం యీళ్లు రోజంతా తిప్పలుపడో, తన్నులు తినో కంసాలి పని నేర్చుకుంటా ఉండేవాళ్లు. నేను అసిస్టెంటు పని చేసేది సాయంగా మా తాతకాణ్ణే కాబట్టి యిళ్లందరికన్నా నా పరిస్థితి ఎంతో బెటరుగా ఉండేది. మా తాత రోజులో రెండు మూడు సార్లు టీ తాగించేవాడు. బజారులోకి మామిడికాయలొస్తే ఒకటి కోసి సగం నాకు పెట్టేవాడు. సాయంత్రం ఆరవంగానే గల్లాపెట్టెలో నుంచి రెండు రూపాయి బిళ్లలు తీసిచ్చి 'యింకింటికి పోరా' అని పంపించేసేవాడు. (తక్కిన అసిస్టెంట్లు రాత్రి ఎనిమిధిదాక ఉండేవాళ్లు).

ఒక రోజు పట్టెపోళ్లకు (బెస్తవాళ్లకు) ఏం పండగొచ్చిందో. ఏమో గానీ మా కొట్టుకి ఉప్పెన తీరులో వచ్చి చాలా సొమ్ములు కొనుక్కోవెళ్లారు. ఆ రోజు మా తాత పట్టపలలవిగాని హుషారుతో నాకు అయిదు రూపాయలు ఇచ్చినాడు– రోజు కూలీ.

నేను ఎగిరి గంతేసినాను.

అదే ఊపులో విశ్వం కాడికి పరిగెత్తుకుంటా వెళ్లి 'నువ్వు లెక్కలు చేసుకుంటా సావరా. నేను అయిదు రూపాయిలు సంపాదించా చూడరా' అన్నాను మెడ ఎగరేస్తా.

వాడు లెక్కల నోటు బుక్కులోని పెద్ద మార్జినులో చేస్తున్న రఫ్‌వర్కును మాని తలపైకెత్తి నవ్వినాడు.

'ఇందాకట్నుంచి చేస్తా వున్నాను. యిప్పటికొచ్చిందిరా ఈ లెక్క' అంటా నా తట్టు చూసి సంతోషంగా నవ్వినాడు. ఎందుకనోగానీ వాడట్ట నవ్వతానే ఉండిపోయినాడు.

*

(ఆ తర్వాత విశ్వంగాడు వాళ్లూళ్లో మంచి కాలేజీ లేదని మా జవహర్ భారతిలో నాతో పాటు ఎంపిసి చేరినాడు. జూనియర్ ఇంటరులో సీనియర్ ఇంటర్ లెక్కలు, సీనియర్ ఇంటరులో ఎంసెట్ లెక్కలు చేసి ర్యాంకు సంపాదించి బి.టెక్కులో చేరినాడు. నాకేమో ర్యాంకు రాక డిగ్రీ చేరినాను. ఇప్పుడు విశ్వం గాడు రెండు జేబుల్లో జీతం పెట్టుకునేంత పెద్ద ఉద్యోగం చేస్తా ఉన్నాడు గానీ ఈ కత వాడి కోసరం, నా కోసరం రాయలా. మా జరివాంటి పిలకాయల కోసరం రాసినాను. మా జరివాంటి చిన్న కొడుకు పదమూడేళ్ల జావెద్గాడు, ఆఖరు కొడుకు పదేళ్ల మున్నాగాడు చదువు మానేసి ఇప్పుడు బంగారు కొట్లలో అసిస్టెంట్లుగా చేస్తా ఉన్నారు. జరుగుబాటు కోసరం బంగారం లాంటి చదువును వదులుకున్న [illegible] బంగారు తండ్రులు కుంపటి ముందర [illegible] నిప్పులు మంటేస్తా ఉంటే ఆ బాధ ఏ తీరున చెప్పను?)

–మహమ్మద్ ఖదీర్‌బాబు